క్లుప్తంగా

ప్రసన్న వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా గురువారం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. 108 వెండి కలశాలలో పంచామృతాలకు అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి అభిషేకించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలకు కల్పించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

జి.కొత్తపల్లిలో 104 సేవలు



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సామ్యశ్రీ

శంఖవరం: జి.కొత్తపల్లిలో వైద్య సిబ్బంది 104 వాహనం ద్వారా రోగులకు వైద్య సేవలందించారు. పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యురాలు ఏలూరి సామ్యశ్రీ రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రత్తిపాడు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ జగ్గంపేట డీఈ రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఏలూరు, టి.రాయవరం, కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారం



ఖాతాదారులు, రైతులకు అవగాహన కల్పిస్తున్న నరసింహమూర్తి

గోకవరం: రైతుల ఆర్థికాభివృద్ధికి యూనియన్ బ్యాంకు అన్ని విధాల సహకారం అందిస్తుందని ఆ బ్యాంకు రీజనల్ చీఫ్ మేనేజర్ జీవీ నరసింహమూర్తి అన్నారు. గమ్మళ్లదొడ్డి గ్రామంలో గురువారం స్థానిక రైతులు, బ్యాంకు ఖాతాదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు, ఖాతాదారులకు అందుబాటులో ఉన్న రుణాల గురించి తెలిపారు. రైతుల కోసం వ్యవసాయ అవసరాల కోసం మరిన్ని రుణ సదుపాయాలను అందుబాటులో ఉన్నాయన్నారు. ఖాతాదారులు, రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రవరంలో అన్నదానం

ఏలేశ్వరం: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా భద్రవరంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయం వద్ద జరిగిన అన్నదానంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ అన్నదానం పాల్గొని వడ్డన చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సూతిబూరయ్య, మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరకులు అంజేస్తున్న నాసా సంస్థ అధినేత నూతలపాటి సోనీవుడ్

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఉద్రిక్తిత ఘటనలో గాయపడిన వారిని గురువారం నాసా సంస్థ అధినేత నూతలపాటి సోనీవుడ్ పరామర్శించారు. ఎస్సీ పేటలో ఆయన పర్యటించి బాధిత కుటుంబ సభ్యులను ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సుమారు 120 కుటుంబాలకు ఆయన నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణమూర్తి, గోపి, శ్రీను, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా..

- బీమాతో ఆదుకున్న ప్రభుత్వం
- గతేడాది ఖరీఫ్ పంట నష్ట పరిహారం మంజూరు
- వేమవరంలో 125 మంది రైతులకు రూ.40.53 లక్షలు
- చామవరంలో 140 మంది రైతులకు రూ.40.05 లక్షలు



తొండంగి మండలం వేమవరంలో వరదలకు నీట మునిగిన పంటలు (ఫైల్)

తొండంగి: ప్రకృతి వైపరీత్యాలకు పంటను నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకుంటోంది. వర్షాలకు పంట ముంపునకు గురై నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేసింది. గతంలో పంట నష్టపోతే ఆ నష్టానికి పరిహారం పొందాలంటే గత ప్రభుత్వాల హయాంలో రైతులు అష్టకష్టాలు పడే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకుంటోంది.

ఇదీ పరిస్థితి

గతేడాది ఖరీఫ్‌లో తొండంగి మండలంలోని పంపా, పీబీసీ, చెరువులు, ఇతర వ్యవసాయబోర్ల కింద 11,600 ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఏజెన్సీ ఎగువ ప్రాంతాల నుంచి అధిక వర్షాల కారణంగా వరద నీరంతా పంపా, పీబీసీ కాలువల ద్వారా మండలంలోని అద్దరిపేట, జమ్మేరు కాలువల ద్వారా సముద్రంలో కలుస్తుంది. ఈనేపథ్యంలో వరదనీరంతా రోజుల తరబడి వేమవరం ప్రాంతంలో నిల్వ ఉండిపోవడంతో పంట నీటమునిగింది. ఇదే విధంగా తుని మండలం చామవరం ప్రాంతంలో కూడా పంటలు మునిగిపోయాయి.

వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తింపు

రైతులు పంట సాగు చేసిన ప్రారంభంలో రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అగ్రికల్చర్ అసిసెంట్లు వీఆర్వోలు, కలిసి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ–క్రాఫ్ బుకింగ్ చేయడంతోపాటు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేశారు. ఈ పథకంలో రైతులు కేవలం ఒక్క రూపాయని మాత్రమే చెల్లించారు. రైతుల తరఫున ప్రభుత్వం బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించింది. ఈ బీమా వర్తింపజేశారు.

నష్ట పరిహారం ఇలా..

గతేడాది ఖరీఫ్‌లో పంటలు మునిగిన నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.నరసింహం క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వానికి నివేదించారు. మండలంలోని వేమవరంలో 224 ఎకరాల్లో పంట దెబ్బతినడంతో 125 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బీమా కంపెనీ రైతులకు పంట కోత ప్రయోగాల దిగుబడి ఆధారంగా ఎకరాకు రూ.18,100 చొప్పున 224 ఎకరాలకు 125 మంది రైతులు రూ.40.53 లక్షలు మంజూరు చేసింది. తుని మండలం చామవరం గ్రామం పరిధిలో 140 మంది రైతులకు 108 ఎకరాల పంట విస్తీర్ణానికి రూ.40.05 లక్షలు పరిహారంగా విడుదల చేసిందని ఏఓ నరసింహం తెలిపారు.



వేమవరంలో దెబ్బతిన్న పంట వివరాలను రైతుల నుంచి తెలుసుకున్న ఏఓ నరసింహం

ప్రభుత్వం ఆదుకుంది



నేను వేమవరంలో గతేడాది ఖరీఫ్‌లో ఏడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. వర్షాలకు పంట దెబ్బతింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా రూ.36,300 పరిహారం మంజూరైంది. ప్రభుత్వం బీమా అందించి మమ్మల్ని ఆదుకుంది.

–తలపంటి లోవ సత్యనారాయణ, కౌలు రైతు, వేమవరం, తొండంగి మండలం

బీమా వర్తింపజేశాం



గతేడాది ఖరీఫ్‌లో వరదలకు నీటమునిగిన పంటలను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా ఎన్యూమరేషన్ చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. వేమవరంలో 224 ఎకరాలకు రూ.40.53 లక్షలు పరిహారం సొమ్ము మంజూరైంది. రెండు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ఏటా రైతులు కచ్చితంగా బీమా కూడా చేయించుకోవాలి.

–ఎస్.నరసింహం, మండల వ్యవసాయశాఖాధికారి, తొండంగి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుని: ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. గురువారం ప్రజా ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. కాలువల్లో పూడిక తీత పనులు చేయడం వల్ల వర్షం నీరు ఎప్పటికప్పుడు దిగువకు పోతుందని, ఎక్కడైనా వ్యర్థాలు ఉంటే గుర్తించి తొలగించాలన్నారు. మురికివాడలు, ఖాళీ స్థలాలు ఉన్న చెత్త వేయకూడదన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ చేసే కార్మికులు సంబంధిత ప్రాంతాల్లో మహిళలకు రోడ్లపై వ్యర్థాలు వేయవద్దని అవగాహన కల్పించాలన్నారు. కూరగాయలు, చేపల మార్కెట్, హోటళ్లు, టిఫిన్ బళ్లు నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయాల్లో ఉన్న ప్రజా ఆరోగ్య శాఖ కార్యదర్శులు విధిగా ఆయా వార్డుల్లో పర్యటించాలన్నారు. దోమల నివారణకు అవసరమైన మందులను పిచికారీ చేయాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఇ.చంద్రనాయుడు తెలియజేశారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్న ఈ కోర్సుల్లో నైపుణ్య అభివృద్ధి చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. బీఎస్సీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, బోటనీ, బీఏలో అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం, హిస్టరీ, కామర్స్‌లో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్, స్పెషలైజేషన్ కోర్సులు ఉన్నాయన్నారు. ఈనెల 12న చివరి తేదీ అని మరింత సమాచారం కోసం 81219 87805, 94411 68657, 72870 10153 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థికంగా అండ

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- బూరుగుపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థికంగా ప్రభుత్వం అండగా ఉంటోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. శుక్రవారం బూరుగుపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ తిరుగుతూ ప్రజలను పలకరించారు. ప్రభుత్వం పథకాలు లబ్ధిదారులకు వివరించారు. పథకాలు అమలు చేస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చంటిబాబు కోరారు. ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ పాతంశెట్టి సత్యవతి, సర్పంచ్ ఆసపు రామలక్ష్మి, ఆసపు భద్రి, వైఎస్సార్ మండల పార్టీ అధ్యక్షుడు దోమాల గంగాధర్, పాతంశెట్టి కృష్ణమూర్తి, కర్రి నారాయణమూర్తి, పాతంశెట్టి విశ్వనాథం, భూపాలపట్నం ప్రసాద్, ఇళ్ల అప్పారావు కాపు, ఎంపీడీఓ బడే రాజేశ్వరావు, వలంటీరు, నాయకులు పాల్గొన్నారు.



బూరుగుపూడిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

జగన్నాథపురంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో శంకర్‌మల్లిక్

కోటనందూరు: వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం జగన్నాథపురంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం చేస్తున్న పథకాలను వివరించారు. గ్రామస్తులను స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీఎం జగన్ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, సర్పంచులు లెక్కల ఉపేంద్ర, సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, బొత్స సత్తిబాబు, రుత్తల జోగిరాజు, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న శంకర్‌మల్లిక్

ప్రజలందరూ సోదర భావంతో మెలగాలి



మండపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు

శంఖవరం: గ్రామాల్లో ప్రజలందరూ సోదర భావంతో మెలిగి, శాంతియుతంగా ఉంటేనే మెరుగైన సమాజం స్థాపించవచ్చని ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు అన్నారు. మండపం గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వారధి కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను గ్రామ పెద్దలతో శాంతి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. వివాదాలకు తావులేకుండా ప్రజలందరూ మెలగాలన్నారు. రోడ్డుపై ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైంగిక నేరాలు,సైబర్ నేరాలు,బాల్య వివాహాలు,రోడ్డు ప్రమాదాలు అరికట్టడంతో కమిటీ సభ్యులకు జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్సై ఎ అజేయ్‌బాబు,సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం, పాలెం వెంకటరత్నం.మహిళా పోలీస్ గౌతమి, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారుల కృషి

- ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి
- మండల సర్వసభ్య సమావేశం

ఏలేశ్వరం: సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలన్నారు. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత మండల స్థాయి అధికారులతో ఆయా శాఖలపై రివ్యూ నిర్వహించారు. మండల పరిధిలోని రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకూ వెళ్లే ఏజెన్సీ ప్రధాన రహదారిపై తీవ్రంగా చర్చ జరిగింది. ప్రభుత్వం నిధులు కేటాయించి ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంపై సంబంధిత అధికారిని నిలదీశారు. గ్రామాల్లో సారా విచ్చలవిడిగా విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాసరావును నిలదీశారు. సారా కేసులో పట్టుకున్న వారికి సాల్వేషన్ ఇవ్వకూడదని సర్పంచ్‌లు కూనపురెడ్డి సుబ్బారావు, పీతల నూకరాజు, బుద్దా సూర్యప్రకాశ్ కోరారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లకు చెప్పకుండా సాల్వేషన్లు ఇవ్వకూడదన్నారు. దీనిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ చిన్నారావు, వైస్‌ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మీ, సాదేలోవరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

తోట నరసింహం జన్మదిన వేడుకలు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ నాయకులు, కాకినాడ పార్లమెంట్ మాజీ సభ్యుడు తోట నరసింహం జన్మదిన వేడుకలు స్థానిక సాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆయన అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అత్తులూరి సాయిబాబా, తుల రాము, కరటూరి శ్రీనివాస్, ఎస్‌ఏ గఫూర్, తోట బాబ్జి, రామకుర్తి మూర్తి, చినబాబు, ఏడు కొండలు, మోహన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

చింతలూరు రైతులకు పట్టాలు మంజూరు చేయాలి



సమావేశంలో రైతులకు అండగా నిలిచిన వామపక్ష నేతలు

ప్రత్తిపాడు రూరల్: చింతలూరు రైతులకు రైత్వారీ పట్టాలను తక్షణం మంజూరు చేయాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. చింతలూరు గ్రామాన్ని గురువారం వామపక్ష నాయకులు, రైతు సంఘాల నాయకులు సందర్శించారు. ఈనాం భూములను సాగు చేస్తున్న రైతులను కలిసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైత్వారీ హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆ గ్రామ రామాలయంలో జరిగిన సమావేశంలో భూముల హక్కుల సాధన కోసం రైతుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. 2017లో చింతలూరు గ్రామాన్ని ఈనాం గ్రామంగా గుర్తిస్తూ ప్రత్తిపాడు తహసీల్దారును విచారణ చేయమని పెద్దాపురం ఆర్డీఓ ఆదేశించారని చెప్పారు. ఆరేళ్లు గడచిన ఎలాంటి ప్రగతి లేదని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్ అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఐ (ఎం.ఎల్.) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు, రైత్వారీ హక్కుల సాధన కమిటీ అధ్యక్షుడు తాడి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకుడు పి.ఎస్.అజయ్ కుమార్, వివిధ పార్టీల నాయకులు ప్రసంగించారు. ఈకార్యక్రమానికి తొలుత వామపక్ష నాయకులు గ్రామంలోని అంబెడ్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మెయిన్ రోడ్లో రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఏబీసీడీ వర్గీకరణకు పోరాడాలి

జగ్గంపేట: ఏబీసీడీ వర్గీకరణ సాధించి తీరక పోతే మన జాతిలోని యువకుల భవిష్యత్తు దెబ్బతింటుందని దీని కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జాతీయనాయుకుడు మందా కృష్ణ మాదిగ అన్నారు. జగ్గంపేట క్షత్రియ కల్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయుకుడు కొత్తపల్లి సంజీవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయుకులు, అనుబంధ సంఘాలు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు లబ్ధి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- మల్లేపల్లిలో 'జగనన్న సురక్ష'

గండేపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామ రక్షని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లేపల్లి సచివాలయం–1లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి అవసరాలను తక్షణమే తీరేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. గ్రామంలో నిలువనీడలేని కుటుంబాలకు నివేసన స్థలాలు మంజూరు చేసి నూతన గృహాలు నిర్మించి నీడనిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి, ఉప సర్పంచ్ దొమ్మ శ్రీను, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు రాజు, మాజీ జెడ్పీటీసీ బిత్రా గిరిబాబు, గండేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి బాబు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమ ఉద్యమం 'జగనన్న సురక్ష'

తుని రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహిస్తోందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. గురువారం లోవకొత్తూరు గ్రామంలో సర్పంచ్ లంక వెంకటలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ వివిధ సర్టిఫికెట్లు లేవన్న కారణంగా ఎవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కోల్పోకూడదన్నారు. గ్రామంలో 845 దరఖాస్తులు రాగా 806 మందికి సర్టిఫికెట్ల జారీ చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి సాధ్యమన్నారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ లంక కృపానందం, మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ దుంగల నాగేశ్వరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, హౌసింగ్ ఏఈ ముద్రగడ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



ఎ.మల్లవరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



మల్లేపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జోరుగా జగనన్న సురక్ష

కిర్లంపూడి: మండల పరిధి గెద్దనాపల్లి సచివాలయ–2లో గురువారం ఎంపీడీఓ బడే రాజేశ్వరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాజేశ్వరావు అన్నారు. సర్పంచ్ మొల్లేటి గంగాభవాని, పెట్ల శ్రీనివాస్, జ్యోతుల దొరబాబు, బిరిసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగంపాలెం, వెదురుపాక గ్రామాల్లో

గోకవరం: మండలంలోని గంగంపాలెం, వెదురుపాక గ్రామాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, నరాలశెట్టి నర్సయ్య, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, దాసరి కృష్ణ, ఆకుల సుబ్రహ్మణ్యం, తోలేటి రాంప్రసాద్, రౌతు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లోవకొత్తూరులో విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు

'జగనన్న సురక్ష'తో సంక్షేమ పథకాలు

రౌతులపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కాకి నాని ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన ఎ.మల్లవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఇటీవల దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. అలాగే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్‌యార్డు చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.సాయి సర్పంచ్‌లు చిందాడ పెదరాజు, వడల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కాకి నాని, ఎంపీడీఓ ఎం.గోవింద్, తహసీల్దారు బి.బీమారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు శ్రీరామరక్ష సురక్ష

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేదలకు శ్రీరామరక్షగా నిలుస్తుందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. గురువారం కాకరాపల్లిలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ అధ్యక్షత జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ గంగాధర్, వార్డు మెంబర్ పెద్దిర్సి రమేష్, తహసీల్దార్ ఐ జగదీష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో పారదర్శక పాలన

తొండంగి: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పారదర్శక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్.ఎంపీపీ నాగం గంగ బాబు అన్నారు. గురువారం బెండపూడిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, ఈవోపీఆర్డీ ఎన్.సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు గాబు రాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి అంజనేయులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణచౌదరి (పెద్దబ్బు), పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి, సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి, పార్టీ నాయకులు ఏలేటి ధర్మరాజు, మద్దుకూరి వెంకటరామయ్యచౌదరి(చిన్నబ్బు), ఎంపీటీసీలు గొంతెన దుర్గా నాగేశ్వరరావు, మళ్ల రవితేజ, సోమిశెట్టి చలపతి, బూసాల గణపతి పాల్గొన్నారు.



బెండపూడిలో లబ్ధిదారులకు ధృవపత్రాలు అందజేసిన పద్మలత, నాగం గంగబాబు